## క్లుప్తంగా

### సన్మానం



వర్ధన్నపేట : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన కానిస్టేబుల్ ఫలితాల్లో అర్హత సాధించిన అభ్యర్థులు సంతోష్, శ్రీకాంత్, రాకేష్‌లను బీఆర్ఎస్, కాంగ్రెస్, స్థానిక నాయకులు మంగళవారం అభినందించి శాలువాతో సన్మానం చేశారు. సన్మానం చేసిన వారిలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి, అబ్బిడి రాజు, అర్జుల తిరుపతిరెడ్డి, ముదిరాజ్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు చొప్పరి సోమయ్య, బీఆర్ఎస్ అధ్యక్షుడు సమ్మయ్య, ఏఎంసీ డైరెక్టర్ సుభాష్, మచ్చ సమ్మయ్య, రాజు, యాకూబ్ పాషా, వెంకటేశ్, రాజు, దిలీప్ తదితరులు ఉన్నారు.

### బీఆర్ఎస్ యూత్ మీట్



దుగ్గొండి : ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పరిపాలనలో నర్సంపేట నియోజకవర్గం విద్య, వైద్యం, వ్యవసాయ రంగంలో అగ్రగామిగా నిలిచిందని బీఆర్ఎస్ నర్సంపేట నియోజకవర్గ యూత్ కన్వీనర్ శానబోయిన రాజుకుమార్ అన్నారు. మండలంలోని ముద్దునూరు, బిక్కాజిపల్లి, బొబ్బరోనిపల్లి గ్రామాల్లో మంగళవారం బీఆర్ఎస్ యూత్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రేవూరి సురేందర్ రెడ్డి, సింగనబోయిన భాగ్యలక్ష్మీ–లింగయ్య, శంకేషి శోభాకమలాకర్, గ్రామ అధ్యక్షులు, యూత్ బాధ్యులు పాల్గొన్నారు.

### అన్నారం దర్గాలో ప్రార్థనలు



పర్వతగిరి : రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు లక్ష ఓట్ల మెజార్టీతో గెలుపొందాలని మంగళవారం పాలకుర్తి యువజన, విద్యార్థి నాయకులు అన్నారం షరీఫ్ దర్గాను దర్శించి ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. ఈ సందర్భంగా కేయూ జేఏసీ వైస్ చైర్మన్, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మేడారపు సుధాకర్ మాట్లాడారు. కార్యక్రమంలో పాలకుర్తి యువజన, సోషల్ మీడియా, విద్యార్థి సంఘాల నాయకులు జలగం నాగరాజు, జోగు కృష్ణ, వంగాల అశోక్, తోకల శోభన్, నవీన్, మహేష్, ఈశ్వర్, అంజి, అరుణ్, సురేష్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

### 'బ్యాటు పట్టి.. ఓట్లు కొట్టేస్తాం'



ఖానాపురం : రాష్ట్ర వ్యాప్తంగా అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వచ్చింది. దీంతో ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించుకోవడానికి అనుచర వర్గాలు పోటీ పడుతున్నాయి. పండుగ సమయంలో అన్ని వర్గాల ప్రజలు గ్రామాల్లో ఉంటుండడంతో ఆయా అభ్యర్థుల అనుచరులు తమ నాయకులను గెలిపించుకోవడానికి ఓటర్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఖానాపురం మండల కేంద్రంలో యువత క్రికెట్ ఆడుతుండగా బీఆర్ఎస్ నాయకులు వారి వద్దకు వెళ్లి సరదాగా వారితో క్రికెట్ ఆడుతూ ఉత్సాహ పరిచారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డిని గెలిపించుకోవడానికి బ్యాటు పట్టేస్తాం.. ఓట్లు కొట్టేస్తామంటూ యువతలో స్ఫూర్తి నింపారు.

### నేటి నుంచి బీఆర్ఎస్ బూత్ కమిటీల ఏర్పాటు

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ 15,16,17 డివిజన్లలో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ బూత్ కమిటీలను ఏర్పాటు చేయడానికి ప్రత్యేక సమావేశాలను నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అర్బన్ ఎన్నికల ఇన్‌చార్జ్ ఎనుమాముల మార్కెట్ మాజీ చైర్మన్ చింతం సదానందం మంగళవారం తెలిపారు. 25న జాన్‌పాక, వసంతాపూర్, దూపకుంట, 26న ధర్మారం, స్తంభంపెల్లి, ఆదర్శనగర్, 27న గరీబ్‌నగర్, కీర్తినగర్‌లో, 28న గొర్రెకుంట, 29న మొగిలిచర్ల, 30న రెడ్డిపాలెం, గోపాల్‌రెడ్డి నగర్, పోతరాజుపల్లి, గోపాల్‌రెడ్డి నగర్‌లలో బూత్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశాలకు స్థానిక కార్పొరేటర్లు, గ్రామ కమిటీ బాధ్యులు, ముఖ్య నాయకులు పాల్గొనాలన్నారు. పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి లక్ష మెజారిటీతో గెలిచే విధంగా ప్రత్యేక కార్యాచరణతో నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు.

### ఇష్టారీతిన వైన్స్‌షాపులు

వర్ధన్నపేట : పట్టణంలోని వైన్స్ షాపుల నిర్వాహకులు ఎక్సైజ్ నిబంధనలకు విరుద్ధంగా సమయ పాలన లేకుండా ఇష్టారీతిన మద్యం వ్యాపారం చేస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఎక్సైజ్ అధికారుల కనుసన్నల్లోనే ఉదయం 8 గంటల నుంచే షాపులను తెరిచి మద్యం విక్రయించడం దారుణమన్నారు.

వర్ధన్నపేట: మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరూరి రమేశ్



నెక్కొండ: అంగడి ప్రాంతంలో గల జమ్మిచెట్టు వద్ద..



వర్ధన్నపేట: ఉత్సవాల్లో పాల్గొన్న చైర్ పర్సన్ అరుణ తదితరులు



# ఘనంగా విజయదశమి

జిల్లా వ్యాప్తంగా విజయదశమి (దసరా) వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఆయా పోలీస్ స్టేషన్లలో నిర్వహించిన ఆయుధ పూజల్లో సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు. సాయంత్రం వివిధ గ్రామాల్లోని బొడ్రాయి కూడళ్లలో సర్పంచ్‌లు, కార్యదర్శుల సమక్షంలో జరిగిన వేడుకల్లో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. జమ్మి చెట్టు వద్ద పూజ చేసి, ఆకులు ఇచ్చిపుచ్చుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. - సాక్షి నెట్‌వర్క్



నల్లబెల్లి: బోనంతో బయలుదేరిన ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి దంపతులు



ఖానాపురంలో బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు



సంగెం:మొండ్రాయిలో రావణాసుర దహనం..



నర్సంపేట రూరల్: లక్నెపల్లిలో..



చెన్నారావుపేట: ఆయుధ పూజ చేస్తున్న పోలీసులు



సంగెం: పోలీసుస్టేషన్‌లో ఎస్సై, సిబ్బంది



దుగ్గొండి: వెంకటాపురంలో దసరా కత్తితో..



చెన్నారావుపేటలో దసరా వేడుకలు



వర్ధన్నపేట: పూజలు చేస్తున్న ఏసీపీ రఘుచందర్



నెక్కొండ: పూజల్లో పాల్గొన్న సీఐ, ఎస్సై



రాయపర్తి: గణేష్‌కుంట తండాలో..



రాయపర్తి: పెర్కవేడులో..

## క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్



బహుమతులు అందజేస్తున్న సారంగపాణి

నల్లబెల్లి : యువత క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి అన్నారు. మండలంలోని మూడుచెక్కలపల్లిలో బీఆర్ఎస్ యూత్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడోత్సవాలు నిర్వహించగా మంగళవారం పోటీలు ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతుల ప్రదానోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శిస్తూ నర్సంపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్ది సుదర్శన్ రెడ్డి గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. ఫైనల్‌లో మేడపల్లి, బుచ్చిరెడ్డిపల్లి జట్లు తలపడగా మేడపల్లి ప్రథమ స్థానంలో నిలవగా బుచ్చిరెడ్డిపల్లి ద్వితీయ స్థానంలో నిలిచిందని, మూడుచెక్కలపల్లి తృతీయస్థానంలో నిలిచినట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఊడుగుల ప్రవీణ్ గౌడ్, పాలెపు రాజేశ్వర్ రావు, చెట్టుపల్లి మురళీధర్, నాయకులు గందె శ్రీనివాస్ గుప్తా, కక్కెర్ల శ్రీనివాస్ గౌడ్, కొత్తపల్లి కోటిలింగాచారి, నూనవత్ వెంకన్న, నూటెంకి సూరయ్య, దేవ్‌సింగ్, మంజీలాల్, సురేష్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## పేకాట శిబిరంపై దాడి

ఖానాపురం : పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసిన సంఘటన మండలంలోని మనుబోతులగడ్డ శివారులో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై మాధవ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మనుబోతులగడ్డ శివారులో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రూ.6,320, నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడుతున్న సూర ఆరోగ్యం, సుర రాజు, శివరాత్రి మోహన్, శివరాత్రి సురేష్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## బెల్టు షాపులపై టాస్క్‌ఫోర్స్ దాడులు



నల్లబెల్లి : మద్యం బాటిళ్లను చూపుతున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు



ఖానాపురం: స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లను చూపుతున్న పోలీసులు

నల్లబెల్లి : మండలంలోని నల్లబెల్లి, లెంకాలపల్లిలో బెల్టు షాపులపై టాస్క్‌ఫోర్స్ అధికారులు మంగళవారం దాడులు చేశారు. ఈ దాడుల్లో మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. నల్లబెల్లికి చెందిన వర్కురి మల్లిక నుంచి రూ.6,150, లెంకాలపల్లికి చెందిన పప్పు రేణు కుమార్ నుంచి రూ.18,810 విలువ చేసే మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని తదుపరి చర్యల నిమిత్తం నల్లబెల్లి పోలీసులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ దేవేందర్, ఎస్సై నర్సింహరావు పాల్గొన్నారు.

ఖానాపురం : మండలంలోని అశోక్‌నగర్ గ్రామంలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించారు. అశోక్‌నగర్‌కు చెందిన శివనందుల అశోక్ అనుమతి లేకుండా కిరాణ షాపులో బెల్ట్ షాపు నిర్వహిస్తుండగా పక్కా సమాచారం మేరకు సోమవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రూ.17,310విలువ గల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని అతనిపై కేసు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న మద్యాన్ని స్థానిక పోలీసులకు అప్పగించారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ పులి రమేష్, ఎస్సై లవణ్, ఏఎస్సై లక్ష్మారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## పండుగ పూట విషాదం

● వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

దుగ్గొండి : దసరా పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఉదయాన్నే నిద్రలేచి గంటలు గడవక ముందే వారి ఇళ్లల్లో చావుడప్పు మోగింది. వేర్వేరు ఘటనల్లో ముగ్గురు వ్యక్తులు మృత్యువాత పడ్డారు. మండలంలోని మల్లంపల్లి, కేశవాపురం, చాపలబండ గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

**ఇంటి పరిసరాలను శుభ్రం చేస్తూ..**



పార్వతమ్మ(ఫైల్)

మండలంలోని మల్లంపల్లికి చెందిన కొండపాక పార్వతమ్మ(46) సోమవారం ఉదయాన్నే ఇంటి పరిసరాలను శుభ్రం చేస్తుంది. కాగా ఆవరణలోని చెట్ల మొద్దళ్ల మధ్య చెత్తను తొలగిస్తుండగా కరెంట్ స్తంభం నుంచి వచ్చే జే వైరు తెగి పడింది. అది గమనించకుండా ఊడుస్తున్న పార్వతమ్మ చేతికి తీగ తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి భర్త శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పరమేశ్ తెలిపారు.

**బట్టలు ఆరవేస్తూ..**



రాజ్‌కుమార్(ఫైల్)

చాపలబండకు చెందిన యాదగిరి రాజ్‌కుమార్ (30) సెలూన్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా దసరా రోజు ఉదయాన్నే స్నానం చేసి ఉతికిన దుస్తులను తీగపై ఆరవేస్తుండగా విద్యుత్ ప్రసారం కావడంతో విద్యుత్‌షాక్ తగిలి అక్కడిక్కడే మృతి చెందాడు.శృతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

**రోడ్డు ప్రమాదంలో యువకుడు..**



రజనీకాంత్ (ఫైల్)

మండలంలోని కేశవాపురం గ్రామానికి చెందిన అదర్ సండే రజనీకాంత్(30) సోమవారం తన బంధువులను గిర్నిబావిలో దించి బైక్‌పై గిర్నిబావికి వచ్చి వెళ్తున్నాడు. చొల్లపల్లి గ్రామానికి చెందిన కొక్కరకొండ ప్రశాంత్ ద్విచక్ర వాహనంతో ఎదురుగా వస్తూ ఢీకొట్టాడు. దీంతో ఇరువురికి తీవ్రగాయాలు కాగా రజనీకాంత్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి రాజేశ్వర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పరమేశ్ తెలిపారు.

**పరస్పరం దాడి.. ఇద్దరికి గాయాలు**

పర్వతగిరి : మండల కేంద్రానికి చెందిన జూలపల్లి రవీందర్‌రావు, జూలపల్లి బుచ్చిరామారావు మంగళవారం పరస్పరం దాడి చేసుకోవడంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ దాడిలో రవీందర్ తలకు గాయాలు కాగా స్థానికంగా చికిత్స చేయించి వరంగల్‌లోని ఆస్పత్రికి తరలించారు. బుచ్చిరామారావును హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు.

## ప్రశాంతంగా ఎన్నికలు జరగాలి



నర్సంపేట రూరల్: కవాతు నిర్వహిస్తున్న పోలీసులు



దుగ్గొండి: కవాతు నిర్వహిస్తున్న సీఐ కిషన్, ఎస్సై

నర్సంపేట రూరల్ : ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని నర్సంపేట టౌన్ ఎస్సై శీలం రవి అన్నారు. మంగళవారం నర్సంపేట పట్టణంలో పోలీసు కవాతు నిర్వహించారు. పోలీస్ స్టేషన్ నుంచి ప్రారంభమైన కవాతు 24వ వార్డులతోపాటు ప్రధాన రహదారులపై చేపట్టారు. కార్యక్రమంలో ఎస్సైలు చరణ్‌రాజ్, రాజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

**పోలీసు కవాతు**

దుగ్గొండి : అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా మండల కేంద్రంలో మంగళవారం పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ పూల్యాల కిషన్ మాట్లాడారు. ఎన్నికల వేళ గ్రామాల్లో ప్రజలు, వర్గాలు వైషమ్యాల జోలికి వెళ్లకుండా ప్రశాంతంగా ఉండాలన్నారు. రాజకీయ పార్టీల కార్యకర్తలు ఓటర్లను రెచ్చగొట్టకుండా ఓట్లు అభ్యర్థించుకోవాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై పరమేష్, ఏఎస్సై విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## గిరిజనులకు అండగా కాంగ్రెస్..



నర్సంపేట: కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో దొంతి మాధవరెడ్డి

నర్సంపేట : గిరిజనులకు అండగా ఉండేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి దొంతి మాధవరెడ్డి అన్నారు. ఈ మేరకు ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం నర్సంపేట మండలం రాజుపేట, గార్లగడ్డతండా, చింతగడ్డతండా నుంచి పలువురు కార్యకర్తలు మండల అధ్యక్షుడు బానోత్ లక్ష్మణ్‌నాయక్ ఆధ్వర్యంలో దొంతి మాధవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాధవరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే గిరిజనులకు 12శాతం రిజర్వేషన్ కల్పిస్తామని అన్నారు. నవంబర్ 30వ తేదీన జరిగే సార్వత్రిక ఎన్నికల్లో మీ అమూల్యమైన ఓటు చేతి గుర్తుకు వేసి కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. గ్రామ అధ్యక్షుడు మండ రమేష్, తండ శ్రీధర్, నూనె నర్సయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**కాంగ్రెస్‌లో చేరిక**

చెన్నారావుపేట : మండలంలోని తోపనగడ్డ తండా, కోనాపురం, ఎల్లాయగూడెం మాధవ నగర్ కాలనీకి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, యువకులు మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు బాలు, క్లస్టర్ బాధ్యులు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దన రమేష్, బండి హరీష్, ఉప సర్పంచ్ లక్ష్మణ్, స్వామినాయక్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రూపిక శ్రావణ్, తదితరులు ఉన్నారు.

## భక్తిశ్రద్ధలతో దుర్గాదేవి నిమజ్జనం



చెన్నారావుపేట: దుర్గాదేవి శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



గీసుకొండలో..



నెక్కొండ: శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లి, బంధంపల్లి, దుగ్గొండి, మల్లంపల్లి గ్రామాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో మంగళవారం రాత్రి దుర్గాదేవి నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. నాచినపల్లి రామాలయంలోని దుర్గాదేవిని ఆలయం నుంచి భక్తులు పాటలు, మేళతాళాలు, కోలాటాల మధ్య అంగరంగ వైభవంగా శోభాయాత్ర నిర్వహించి గ్రామ పొలిమేరలోని చెరువులో నిమజ్జనం చేశారు.

**చెన్నారావుపేటలో..**

చెన్నారావుపేట : మండలంలోని పలు గ్రామాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. మండల కేంద్రంలోని సిద్దేశ్వరాలయంలో దుర్గాదేవి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కంది విజయ గోపాల్ రెడ్డి, ఉప సర్పంచ్ కంకల మాధవి, మల్లయ్య, రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు

**దుర్గాదేవికి నీరాజనం..**

నెక్కొండ : మండల కేంద్రంలోని రామలింగేశ్వరాలయం, అంబేడ్కర్ సెంటర్‌లో పూజలందుకున్న దుర్గామాతకు ప్రత్యేక వాహనంలో మంగళవారం ఊరేగించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, దుర్గామాత మాలధారులు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

గీసుకొండ: మండల కేంద్రంలో మంగళవారం దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అలాగే మరియపురంలో దసరా వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

## బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



ఖానాపురం: సాయం అందజేస్తున్న స్నేహితులు



రాయపర్తి : తిర్మలాయపల్లిలో..

రాయపర్తి : మండలంలోని తిర్మలాయపల్లికి చెందిన కోండ్ర రాములు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా బాధిత కుటుంబాన్ని మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన జినుగు వేమన్‌రెడ్డి రూ.5వేలు, నాయకులు రూ.10వేలు ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో ముద్రబోయిన వెంకటేశ్వర్లు, జినుగు రత్నాకర్‌రెడ్డి, పాశం సరోత్తమ్‌రెడ్డి, కొంక శ్రీనివాస్, వశపాక రవికుమార్, ఎల్లయ్య, ముత్యాల సంతోష్‌గౌడ్, రాజు, బండి రమేష్, నాగరాజు, ప్రశాంత్, మహేందర్ పాల్గొన్నారు.

**ఖానాపురంలో..**

ఖానాపురం : మండలంలోని కొత్తూరుకు చెందిన యాకయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, మృతుడి కుమారుడు భాస్కర్ స్నేహితులు బాధిత కుటుంబ సభ్యులను మంగళవారం పరామర్శించి రూ.6,016 నగదు అందజేశారు. కార్యక్రమంలో కందికట్ల వీరేష్, రమేశ్, రాము, తోట రాజు, దేవేందర్, అరుణేష్, సురేష్, అశోక్, వెంకటేష్, తదితరులు ఉన్నారు.

## అంబేడ్కర్ ఆశయాలు గొప్పవి



వర్ధన్నపేట : అంబేడ్కర్ ఆశయాలు గొప్పవని తెలంగాణ రాష్ట్ర అంబేడ్కర్ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య, కేయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సంకినేని వెంకట్ అభిప్రాయపడ్డారు. పట్టణ కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించడంతో పలువురు నాయకులు మంగళవారం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నర్సయ్య మాట్లాడుతూ.. పట్టణంలో అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠ సంతోషాన్ని కలిగిస్తుందన్నారు. ప్రతీ ఒక్కరు అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకుపోవాలన్నారు. అంబేడ్కర్ చేసిన సేవలను గుర్తుచేశారు.